* కథానిక

# పెళ్ళి

* శ్రీ జొ. వేం. రా.

ఫ్లినే కంపెనీలో గుమాస్తా గిరీ చేస్తున్న గస్టావ్, లూయీ తండ్రి దగ్గరకు వెళ్లి తనకు ఆమెను పెళ్లి చెయ్యమని అడగ్గానే, లూయీ తండ్రి వేసిన మొదటి ప్రశ్న యిది:

"నాయనా! నీకు నెలకు రాబడి ఎంత?"

"ఎనభై రూపాయలు కాని లూయీ నేను..."

"ఆ మాటల మాట అలావుండనీ. ముందు మాట నీ సంపాద్యం మీ ఇద్దరికీ చాలదు."

"అలా కాదండి. మేము ఎంతో గాఢంగా ప్రేమించుకొన్నాం."

"బహుమంచిదయ్యా. ప్రేమించుకోవడం కూడదని నేననటంలేదు. నీ జీతం ఈ ఎనభయ్యేనా, ఇంకా ఇళ్లు, భూమి పుట్రా ఏమన్నా వున్నాయా?"

"ఏమీ లేవు కాని అవసరమైతే మరికొంత కష్టపడి సంపాదిస్తా."

"ఎలాగని"

"కథలురాస్తా. నా కథలు మీరు చూడ లేదూ? సినిమావ్యాసాలుకూడా వ్రాస్తా. ఏ అచ్చాఫీసు వాళ్లకైనా సాయంకాలం ఓ గంట సేపు ప్రూఫులు దిద్దిపెటతా. ఏగో ఈ విధంగా 15, 20 రూపాయలు ఏరకపోతానా?"

"పుస్తకాలేమీ వ్రాయలేదూ?"

"లేకేం? జెన్‌కిన్స్ లిమిటెడ్‌కు ఒక డిటెక్టివు నవల ఫ్రెంచిలోనుంచి ఇంగ్లీషులోనికి అనువదిస్తున్నా. ఈ మాట మరిచే పోయా. పేజీకి రూపాయన్నర ఇస్తారు."

"మొత్తం ఏమాత్రం వస్తుంది దీనిమీద?"

"రెండు మూడు వందల రూపాయలు వస్తాయి. ఇవి పెళ్లి ఖర్చులకు సరిపోతాయి" అన్నాడు గస్టావ్.

"పెళ్లి జరగాలే గాని ఉదయం కూడా ఫ్రెంచి భాషలో రెండు ట్యూషన్లు చెప్పుకుంటా." అన్నాడు మళ్లీ.

"ఏమన్నా వంద దాటదు. మీ ఇద్దరకు వంద రూపాయలు ఏదో విధంగా సరిపోయినా, పిల్లలు పుట్టుకొస్తే అప్పు తప్పదు."

"ఇప్పటినుంచి పిల్లలెందుకండీ? ఇప్పుడు దాన్ని గురించి బెంగ పెట్టుకోవడం దేనికి?"

"వెర్రివాడా! ఇప్పటి నుంచీ ఎందు కంటే మాస్తారా? పిల్లలు తప్పకుండా పుడతారని అంచనా వేసుకొనే ఎక్కువ సంపాదనకు పూనుకోవాలి. ఇంతకీ నా అంగీకారమే తరువాయి అంటావు. సరే, పిల్లనిచ్చి పెళ్లి చెయ్యడానికి ఒప్పుకున్నట్లే. బాగా సంపాదన మొదలు పెట్టు. ముహూర్తం నిర్ణయిస్తాను." అన్నాడు లూయీ తండ్రి రిచర్డ్.

గస్టావ్ ఆ మాట విని సంతోషంతో ఎగిరి గంతేశాడు. లూయీ అని పిలిచాడు. ఇద్దరూ ఆనందోత్ఫుల్ల వదనాలతో హాయిగా చెట్టాపట్టాలు వేసుకుని హోటల్‌కు చక్కా పోయారు.

ఇక అక్కడ నుంచి గస్టావ్ రోజూ సాయంకాలం వచ్చేవాడు. తాను అనువదిస్తున్న నవలను పూర్తి చేసి, ఆ ప్రూఫులు దిద్దడానికి తెచ్చుకొనేవాడు.

ఒకనాడు ఆమెను సినీమాకు తీసుకు వెళ్లి, తిరిగి వచ్చేటప్పుడు వాన వచ్చిందని టాక్సిలో ఇంటికి తీసుకు వచ్చి దిగబెట్టే సరికి ఎనిమిది రూపాయలయింది.

ఆ తర్వాత ఏదో ప్రయివేటు కుదిరింది. దానికైనా తిన్నగా వెళ్లక అప్పుడప్పుడు లూయీనీ షికార్లకు తీసుకు వెళ్లేవాడు.

పెళ్లి రోజు సమీపించిన కొలది తమ కాపరానికని అద్దెకు తీసుకున్న మేడ వాటాను అలంకరించుకోవడం, కుర్చీలు, బల్లలు, వంట సామగ్రి, బట్టలు మొదలైనవి కొనుక్కోవడంతో గడిచిపోయింది. ఈ సందడిలో పై సంపాదనకు గస్టావ్‌కు వీలు లేకుండా ఆటంకం ఏర్పడింది. పెళ్లి

అయిపోతే ఇక నిరభ్యంతరంగా సంపాదించుకోవచ్చునను కొన్నాడు గస్టావ్.

* * *

ముహూర్తపు రోజు ఆసన్నమయింది. పెళ్ళి సలక్షణంగా జరిగింది. నవల ప్రతిఫలం పూర్తిగా కర్చయిపోయింది. ఆమెకు పెళ్లినాటికి కొన్న సిల్కు గౌనే 200 రూపాయల ఖరీదయింది. అద్దెకు తెచ్చుకొన్న పందిరి మంచంపై ముఖమల్ పరుపుమీద సంతృప్త చిత్తంతో నిద్రించిన ఆదంపతులు మరునాడు ఆదివారం కావడంవల్ల ఎనిమిది గంటల వరకు లేవనే లేదు.

కిటికీ నుంచి సూర్యరశ్మి లోనికి ప్రసరించింది. కిరణాలు అతని ముఖంపై సూటిగా ప్రసరించడంతో మెలకువ వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకొని సయంగా హోటలుకు వెళ్లి రొట్టె, కాఫీ తెచ్చాడు. అప్పటికి లూయిూ లేచింగి.

మరునాటి ఉదయం ఇద్దరు సరదాగా కోచ్ ఎక్కి బజారుకు వెళ్లి పటాలు, ఫ్లవర్ వేస్‌లూ పళ్లూ ఇంకా ఏవేవో కొనుక్కు తెచ్చుకున్నారు.

ఆ రాత్రి సర్కస్‌కు వెళ్లారు. ఇలాగే మొదటి నెల అంతా విందులు—షికార్లు, సినీమాలతో గడచి పోయింది.

ఇలాగ దంపతులు ఆనందమయంగా జీవితాన్ని మరి నెలల పాటు సాగించారు. లూయిూ గర్భవతి అయింది.

ఈ మాట ఆమె తలిదండ్రులకి తెలిసింది. గస్టావ్ కూడా ఆనందించాడు. మగ పిల్లవాడు పుడతాడని గస్టావ్-ఆడ పిల్లని లూయిూ వాదించు కొనేవారు. అయితే లూయిూ మాత్రం ఒకందుకు భయపడింది.

"మీరు జీతం తప్ప మరేమీ సంపాదించడం లేదు. ముందు ముందు ఎంతో కర్చు వుంటుంది. ఇప్పటికే బాకీలన్నీ ఆ నెల కానెల పెరిగి పోతున్నాయి" అని హెచ్చరించింది.

'మరేం పర్వాలే' దని గస్టావ్ ఒక స్నేహితుడి దగ్గరకు అప్పుకు వెళ్లాడు. స్నేహితుడు ఇంత ఖర్చుచేస్తూ పిల్లలు పుట్టుకు వస్తే వాళ్లకు ఏం పెట్టి, నువ్వు ఏం తింటూ? వని చీవాట్లు పెట్టాడు.

వట్టి చేతులతో ఇంటికి వచ్చేసరికి ఎవరో ఇద్దరు తన కోసం వచ్చారని తెలిసింది గస్టావ్‌కు.

స్నేహితులనుకొన్నాడు గస్టావ్. కాని నౌకరు చెప్పిన దాన్ని బట్టి ఋణదాతలని తేలింది.

"ఏమండీ! మనం చివరకు వీధిలో పడిపోతాం. ఇంటి యజమాని వచ్చి గింజుకుంటున్న సమయంలోనే గుడ్డల కొట్టువాళ్ల బిల్ కలెక్టర్ చెడామడా మాటలు పేలి చక్కా పోయాడు. ఇంకా పాలమనిషి, లాండ్రీ ఇవన్నీ తొందరగా తీర్చి వేయాల్సి వున్నాయి. ఏమన్నా అంటే మీకు కోపం వస్తుందని చెప్పడం లేదు." అంది లూయిూ.

"అప్పుకోసం చూస్తున్నా పిల్లా" అన్నాడు.

"వీటికి తోడా?" అంది.

"కాదు, ఆ అప్పుతో ఇవన్నీ ఒక్కసారి తీర్చివేద్దాం. మరేం భయపడక. రా కాస్త బీర్ త్రాగుదాం. ఈ చికాకంతా మరిచిపోవచ్చు." అన్నాడు గస్టావ్.

* * *

నెలలు నిండాయి. లూయిూకి పురుడు వచ్చింది. ఆడపిల్ల పుట్టింది. చేతిలో కానీలేదు. ఖర్చుకు డబ్బివ్వాలి. ఊయెల కొనాలి. బాలింతరాలికి పథ్యంపానం బోలెడు ఖర్చు భరించవలసి వచ్చింది.

లూయిూ తండ్రితో చెప్పుకుంది. గస్టావ్‌ను పిలిచి "ఈ ఒక్కసారి మాత్రమే నేను సాయంచేస్తున్నాను. నాకు లూయిూ ఒక్కర్తె పిల్లకాదు. ఇంకా నలుగురు వున్నారు. పైగా నేనేమైనా అంతడబ్బున్న వాణ్ణి కాను." అంటూ కొంత పైకం సర్దాడు రిచర్డ్.

మూడు నెల్లు గిర్రున తిరిగాయి.

"ఇకనైనా జాగ్రత్తగా మసలండి." అని తండ్రి హెచ్చరించాడు. అప్పులు పెరిగి పోతున్నా ఆడపిల్ల పుట్టిన ఆనందంలో వారికి ఆ బాధ కనబడ లేదు.

చివరకు స్టోర్సువాడు అరువు ఇవ్వనన్నాడు. పాలమనిషి "మేం మాత్రం బతకక్కర్లేదా?" అని నాలుగు ఝాడిం

చింది. ఇంటి యజమాని నోటీసు ఇచ్చాడు ఖాళీచెయ్యమని.

గస్టావ్ సిగ్గుపడ్డాడు. దారిద్ర్య దేవతకరాళ రూపంతో సాక్షాత్కరించ సాగింది. బిడ్డ మాట లూయీకి ఆందోళన కలిగించింది. గస్టావ్ ముఖాన నెత్తురు చుక్క కనిపించడం లేదు.

అవ్యక్తికి కూతురి నిచ్చి ఎంత తెలివి మాలిన వాణ్ణైనానని పశ్చాత్తాపడ్డాడురిచర్డు. తిన్నగా గస్టావ్ ఇంటికి వెళ్లి కూతుర్ని, బిడ్డనితన ఇంటికి తీసుకు వచ్చాడు.

భర్త వెనక దిగులుపడి కూచుని వుండగా తను లేచి రావడం లూయీకి కష్టంగానే వుంది. కాని వెళ్లక ఏం చేస్తుంది? ఇంట్లో డబ్బు లేదాయె. తినడానికి పూట తిండికైనా టికాణీ లేకపోయె.

లూయీ ఎక్కి వెళ్లినబండి మలుపు తిరగగానే అమీనాలు వచ్చి, ఇంట్లోని కుర్చీలు, బల్లలు, మంచాలు, పాత్ర సామగ్రి సమస్తము తీసుకొని పోయారు.

గస్టావ్ కృంగిపోయాడు. ఆ ఇంటిలో ఒక్కడూ నిలిచి, కిటికీ గుండా శూన్యంకేసి చూస్తు బావురుమని ఏడ్చాడు. ఏడ్చి, హృదయాన్ని ఒక మూలలజ్జ, పౌరుషందహిస్తున్నా దుఃఖం తనువునే క్రిందకు క్రుంగదీస్తున్నా మామగారింటికి వెళ్లాడు.

"జీతంతో హోటల్‌లో తిని అప్పులు తీర్చు. ఆదివారం నాడు ఇక్కడికి వచ్చి, పెళ్లాన్ని పిల్లనీ చూడు. అయితే నువ్వు అమ్మాయితో ఒంటరిగా ఎప్పుడు మాట్లాడ్డానికి వీల్లేదు. రాత్రిళ్లు డెయిలీ గెజిట్ పత్రికలో ప్రూఫ్ రీడరుగా నీకు పని కుదిర్చాను. నడు" అని మామగారు నిష్కర్షగా చెప్పారు.

గస్టావ్ ఏమీ అనలేదు. అలాగే రెండు నెలలు గడిచిన పిమ్మట అంతడు ఇంట్లో వుండడానికి మామగారు అంగీకరించాడు. లూయీ మాత్రం ఖడేరావ్—దూరంగా వుండి మాట్లాడ వలసిందే!

కనీసం ఇరవై ఏళ్లు కష్టపడ్డా గస్టావ్ ఆ రుణాలు తీర్చడం అసంభవం. ఈలోగా మామగారు 'హరీ' అంటే నిలవ నీడకూడా వుండదు.

గస్టావ్ ఒక్కసారిగా తనపై పిడుగుపడితే బాగుండుననుకున్నాడు. మానవ జీవితంలోని కఠోరతను తలచుకొని తీరని వెత చెందాడు.

"జంతుకోటికే ఆహారానికి అంత తాపత్రయం లేదు. సృష్టిలో ఒక్క మానవునకే తిండికి కాయకష్టం. భగవంతుడు నిజంగా వున్నాడా? ఉంటే మానవులపై ఈ కాఠిన్యందేని" కని గస్టావ్ యోచిస్తూవుంటాడు ఇప్పటికీ.

(ఫ్రెంచి కథకు స్వేచ్ఛానువాదం)

★

అన్నిదగ్గులు
ఉబ్బసముకు
ఆయాసమునకు
కాశ్మీర్
దివ్యమైనది
"గిరిజా కంపెనీ"
రాజమండ్రి.